మానవుడు మానవుడే!

# కుమారుడి మరణం

(మనస్తత్వ పరిశీలన)

గిడుతూరి సూర్యం

ఇంటినిండా జనం. అందరి సంభాషణా కుమార్ అకాల మరణంగురించే. శవాన్ని డాక్టర్లు పరీక్ష చేశారు. ఎవరూ చంపలేదు. ఆత్మహత్య అంతకన్నా చేసుకోలేదు. ఏవిధమైన జబ్బుచేతా చనిపోలేదు. మనిషి శీలంలో యెటువంటి అవలక్షణాలూ లేవు. పోనీ ఏమైనా కష్టాలుండి బెంగతో చనిపోయాడంటే అదీ లేదు. ఏదో తండ్రి సంపాదించిన ఆస్తి పుష్కలంగా ఉంది. బాగా చదువుకుంటున్న వాడు. పోనీ ఎవరినైనా ప్రేమించి భగ్నహృదయుడయ్యాడా, అదీ లేదు. ఏవైనా గృహకల్లోలాలున్నాయా అంటే వాటి కెన్నడూ ఆస్కారంలేదు తండ్రి కొక్కడే. అతని ప్రేమంతా ఆ ఒక్కకొడుకు మీదనే కేంద్రీకరించి జీవితశేషం గడుపుకుంటున్నాడు. ఇంట్లో ఉన్నఒక్కనౌకరూ గౌరవ మర్యాదల్తో తన సేవకావృత్తి చేస్తున్నాడు. గృహకల్లోలా లేమీలేవని చెప్పవచ్చు. అయితే ఆ ధనవంతుని కొడుకు కుమార్ యెలా చనిపోయినట్లు? అదే తెలియకుండా ఉంది. మామూలుగా కాలం సమీపించి పోయాడంటే కుమార్ వృద్ధుడు కాదు. ఎవరైనా పగవారు చంపారంటే అతని వంటిమీద ఒక్క గాయం కూడా లేదు. అతనికి పగవారు ఉండటానికి వీలులేదని అతని శాంతస్వభావం, సాత్విక గుణాలే చెప్తాయి.

పోనీ అతని హృదయం దుర్బలమైనదా అంటే అలా ఎన్నటికీ కాదు. అతను మంచి ఆటకాడు. అతని ఆరోగ్యం ఎప్పుడూ బాగానే ఉండేది. డిటెక్టివ్‌లు, డాక్టర్లు, లాయర్లు అంతా వచ్చి చూశారు. వృద్ధుడి దుఃఖానికి మేరలేదు. ఒక్కగా నొక్క కొడుకు పోయాడు. తానిప్పుడు ఏకాకి! అతనికీ జగత్తంతా అంధకారం! ఆచావు తనకైనా వచ్చింది కాదేమా అని భావించాడా వృద్ధుడు. ఆచావు తన బిడ్డకు ఎలా సంభవించింది? అందరికీ అదే ప్రశ్న. చనిపోయే రోజువస్తే ఎవరు ఆపగలరు? అది పూర్వ జన్మ ఫలం. "బ్రహ్మ గీత ఎవ్వరూ తప్పించలేరు" అన్నారు వేదాంతులు. "కారణం లేకుండా ఎవరికీ ప్రాణం పోదు. అతని చావుకు ఏదో కారణం ఉండా లన్నారు" శాస్త్రజ్ఞులు. అయితే కారణం చెప్పమన్నారు వేదాంలు- అదే ఆలోచిస్తున్నా మన్నారు నవీనులు. ఆలోచనకు ఒక ఆయువు పట్టు దొరుకుతుందేమో కాని ఒక్కటే ఆశ. అదేమిటంటే అతని మృత శరీరం వర్చస్సు. ముఖంలో ఒక చిహ్నం. కళ్లు బాగా తెరవబడ్డాయి. పెదిమలు కొంచం తెరచుకొని ఉన్నాయి. ముఖ వర్చస్సు పరికిస్తే దేనినో చూచి ఆశ్చర్యపడినట్లు కనిపిస్తుంది. కుమార్ వెనుక ఏమైనా ఒక నిగూఢ గాథ ఉందా? ఏమో! ఎవరికి తెలుసు! ఏదైనా దయ్యాన్ని చూచి అలా చకితుడయ్యాడా? అతనికి దయ్యాలమీద నమ్మకం లేదు. ఏదైనా భయంకర దృశ్యం చూచాడా! అయితే ఆదృశ్యం ఏమై ఉంటుంది?

డబ్బుకొరకుగాని మరెందుకైనా, అతన్నెవరైనా వెంబడిస్తున్నారా? అతనికి ఒక్క స్నేహితుడుగాని ఒక్క విరోధిగాని లేరనీ, ఎవ్వరూ అతనికొరకు ఎప్పుడూ యింటికి వచ్చేవారు కారనీ తండ్రి చెప్పాడు.

ప్రాణం పోయిన శరీరవైఖరి చూస్తే అతను చాలా రాత్రివరకూ నిద్రపోలేదని, ఒక్కగడియ సేపయినా నిద్రపోకుండా చనిపోయాడని తెలుస్తోంది. అక్కడికివచ్చిన వారిలో మనస్తత్వవేత్తలు కూడా ఉన్నారు. ఆ వృద్ధుడి తలమీది వెంట్రులన్ని ప్రశ్న పరంపరలు కురిపించారు. ఓపికతో అన్నిటికీ సమాధానం చెప్పాడు. ఆ గదంతా పరిశోధించారు. వారి దృక్పథంలో కుమార్ పడు

కున్న మంచం క్రిందగా గోడ దగ్గర ఒకబొద్దింక పురుగు చనిపోయి పడి ఉంది. దాన్ని చీమలు పీక్కు తింటున్నాయి. మనస్తత్వ వేత్తల మనస్సులు దాని మీదకు పరుగెత్తాయి. 'ఆ బొద్దింక అక్కడి కెలావచ్చింది' అని ఆలోచిస్తున్నారు. వీళ్ళబుర్రలు వేడెక్కి చలించి పాడయిపోయాయని అక్కడ వాళ్లంతా తలబోశారు. ఈ పురుగులు మీ యింట్లో ఎప్పుడయినా అవుపిస్తుంటాయా అని ప్రశ్న. ఇదేం ప్రశ్న? నల్లులు, దోమలు, బొద్దింకలు లేని ఊరంటూ, ఇల్లంటూ ఉంటుందా? అని అక్కడి వారు విసుగుజెందారాఅమ్మమ్మ ప్రశ్నవిని.

"మా యింట్లో ఈ పురుగులు ఎక్కువగా లేవు కానీ..."

"కానీ... ఏమిటో చెప్పండి"

"కాని అప్పుడప్పుడు సామాను గదిలోంచి వస్తూవుంటాయి."

"సాధారణంగా ఏ వేళప్పుడు వస్తుంటాయి?"

"ఏ అలజడీ లేనప్పుడు, ఎక్కువగా రాత్రులప్పుడు."

"రాత్రిళ్ళా? ఏ టయిములో?"

"సుమారు 12 గంటలకు 1 గంటకు మధ్య వస్తుంటాయి..." అని యింకా ఏమేమో చెప్పబోయి ఎందుకని మానేశాడా వృద్ధుడు.

"అసలు విషయం మరచి, బొద్దింకల గొడవలో పడ్డారేం? వేళవుతోంది. దహన సంస్కారాల గురించి ఏమైనా ఆలోచిస్తారా?" అని ఒకరు.

"జరిగిందేదో జరిగిపోయింది. జరగవలసిందేదో ఆలోచించండి."

"ముసలాయన అలాగే బెంగతో ఉన్నాడు" అని మరికొంతమంది పెద్దలు పలికారు.

కాని మనస్తత్వ వేత్తలు ఊరుకోలేదు. బొద్దింక చరిత్ర సాంతం వింటేగాని వీల్లేదన్నారు.

"మీరిందాకేదో చెప్పబోతూ ఆగారు, ఆ విషయం చెప్తారా?"


"ఆ...ఆ...ఏమీ లేదు."

"ఏమీ లేదేమిటి. ఏదో ఉంది. చెప్పండి."

"ఏం చెప్పాలి. ఒకనాడు మా వాడు చాలా పొద్దెక్కి లేచాడు. నేను గదిలో వచ్చి చూస్తును గదా వాడి మంచంచుట్టూ వందలకొద్దీ చనిపోయిన బొద్దింకలు చీమలపుట్టు. ఏమిట్రా యిదంతా అనిమా వాడిని అడిగితే నాన్నారూ! నేనొక్కణ్ణీ యీగదిలో పడుకోలేనండీ, నాకు చాలా భయంవేస్తుంది. నేను చదువుకుంటుంటే నా పుస్తకంమీద ఓ పెద్ద పురుగు కీసీడ కనుపించింది. అతి భయంకరంగా కనబడుతూ రెక్కలు విదిలించుకుంటూ లైటు డోమ్ మీద నుండి నామీదకు విరుచుకు పడింది. నా గుండె ఝల్లుమంది. కోపంవచ్చి వెంటనే దాన్ని కొట్టి చంపానండీ. కాని అమ్మ చెప్పిన మాటలు జ్ఞాపకానికొచ్చాయి. 'బొద్దింక లక్ష్మి సమానం. వాటిని చంపకూడదు నాయనా' అని చెప్పింది. కాని ఏం చేయను? ఇంతలోకే ఎక్కడినుంచో వందలకొద్ది బొద్దింకలు లోపలికి వచ్చి నన్ను చుట్టేశాయి. రెపరెప కొట్టుకుంటూ రంపంలాంటి కాళ్ళతో నామీద దాడి చేశాయి. నాకు చాలా భయం వేసింది. బయటకు పారిపోదామనుకున్నా కాని కోపం బాగా వచ్చింది. చేతికందిన దాన్ని అందినట్లు పిచ్చివాడిలాగా వాటిని తరిమితరిమి చంపాను నాన్నగారూ! ఒక్క పురుగుకూడా లేకుండా హతమార్చా! చాలా పొద్దోయింది. కాని అమ్మ చెప్పిన మాటలు నా చెవుల్లో గింగిరుమంటూ చాలా రాత్రివరకూ నిద్ర పట్టలేదు నాన్నారూ!" అన్నాడు. ఆ రాత్రంతా కలలో కోటానుకోట్ల బొద్దింకలు కనుపించాయట" అని వృద్ధుడు పలికే కళ్ళవెంట నీరు నింపుకున్నాడు.

"ఆ తర్వాత ఎప్పుడయినా యీ బొద్దింకలు కనుపించాయా" అని ఆఖరి ప్రశ్న వేశారు. దానికి లేదని జవాబు వచ్చింది. ఈ గాథ వింటున్న అక్కడి వారంతా స్తబ్ధులై నిలబడ్డారు. ఇకనేం కుమార్ చావు రహస్యం కనిపెట్టామని సంతోషించారు మనస్తత్వవేత్తలు. అంతిమ విజయం తమదే నన్నట్లు కుమార్ చనిపోయిన కారణాలీవిధంగా చెప్పారు. "కుమార్ చాలా పిరికి మనిషి. గుండె నిబ్బరం లేని మనిషి. నమ్మకాలు లేనట్లు నటిస్తాడేగాని లోపల భయపడుతూనే ఉంటాడు. తల్లి చెప్పిన మాటలు అతన్నెప్పుడూ వెన్నాడుతూనే ఉన్నాయి. ఆ చనిపోయిన బొద్దింకలు అతన్ని ఒక మహా పాత

కునిగా చూస్తువిడవకుండా అతనికళ్లల్లోకనిపిస్తూనే ఉన్నాయి. అప్పటికీ గుండె ధైర్యంతో కాలం గడుపుతూనే ఉన్నాడు. కాని రాత్రి మళ్లా బొద్దింక అతనికి కనుపించింది. ఒక మహా భూతంలాగా రెక్కలు విదల్చుకొని కనిపించింది. అది తన జాతిపై గావించిన అత్యాచారానికి పగదీర్చుకోడానికన్నట్లు అతని మీదికి భయంకరంగా దుమికింది. ఆ భయం భరించలేక అమితాశ్చర్యంతో దానిపైపే చూస్తూ ప్రాణాలు ఒదిలేశాడు. ఇటువంటి సంఘటనలు విదేశాలలో సాధారణంగా జరుగుతుంటాయి. ఇటువంటి వారికి తొడమీద ఆపురుగంత పుట్టుమచ్చ ఉంటుంది." అని మనస్తత్వ వేత్తలు పలికారు. శవం తొడమీద గుడ్డ తొలగించి చూశారు. అత్యాశ్చర్యం! అక్కడి వారంతా చకితులయ్యారు. మనస్తత్వ వేత్తలు చెప్పినట్లే బొద్దింక ఆకారంలో ఒక పెద్ద పుట్టుమచ్చ.



ఐ. ఏ. ఎఫ్. స్టేషన్, జలహాల్లి

బెంగుళూరు వద్ద ఉన్న జలహాల్లిలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (భారతసేన వైమానికశాఖ) స్టేషన్ ఉన్నది. అక్కడ పనిచేసేవారి భోజనశాల ఇండియాలో ఉన్న అన్ని వైమానికశాఖ స్టేషనులకు చెందిన భోజనశాలలకంటే ఎక్కువ ఆకర్షణీయంగా, పరిశుభ్రంగా ఉందని నిర్ణయింపబడింది. అందువల్ల యీసంవత్సరపు "ముఖర్జీట్రోఫీ" యీ జలహాల్లీ స్టేషనుకు యిచ్చారు.

శిక్షణ పొందుతున్న వారు ఫలహారం తీసుకుంటున్న ఒకనాటి దృశ్యం.